క్లుప్తంగా

స్నేహితుడి కుటుంబానికి చేయూత



రవీందర్ కుటుంబానికి నగదు అందజేస్తున్న స్నేహితులు

కందుకూరు: బాల్య మిత్రుడి భార్య ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో స్నేహితులు అండగా నిలిచారు. మండల పరిధి ఆకులమైలారంకు చెందిన ఆనమోని రవీందర్ భార్య పక్షవాతంతో చికిత్స పొందుతోంది. ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న బాధిత కుటుంబానికి.. రవీందర్‌తో 1992–93 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులంతా కలిసి రూ.40 వేలు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సురేందర్, బి.సుభాష్ చంద్రారెడ్డి, అంజయ్య, కె.శ్రీనివాస్, వి.వెంకటేశ్, నరసింహ, కన్నయ్య, ఏ.కాశయ్య, ప్రభాకర్, నర్సింగ్, ఎస్.వెంకటేశ్, లార్డ్ శ్రీశైలం, ఎండీ కాజామియా, జి.నరసింహ, టి.శ్రీనివాస్, జి. వెంకటేశ్, పి.గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు ముందస్తు టీకా తప్పనిసరి



మీర్‌ఖాన్‌పేటలో పశువులకు టీకా వేస్తున్న పశువైద్యుడు, సిబ్బంది

కందుకూరు: పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకుండా రైతులు ముందస్తుగా టీకా ఇప్పించాలని పశువైద్యుడు డాక్టర్ ఎండీ షైన్‌షేక్ అన్నారు. శుక్రవారం మండల పరిధి మీర్‌ఖాన్‌పేటలో వ్యాధి నిరోధక టీకా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటా ప్రభుత్వం ఉచితంగా టీకా పంపిణీ చేస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీకాతో పశువులకు రక్షణతో పాటు, పాల దిగుబడి బాగుంటుందని చెప్పారు. శిబిరంలో వంద ఆవులకు టీకా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది నాగునాయక్, మైత్రీ, ఏ.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులపై ఫిర్యాదు



ఎస్‌ఐ సైదులుకు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

కందుకూరు: ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రులు అమిత్‌షా, కిషన్‌రెడ్డిలను అసభ్య పదజాలంతో దూషించిన కాంగ్రెస్ నాయకులు అద్దంకి దయాకర్, అంజన్‌కుమార్ యాదవ్‌లపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ మహేందర్, జిల్లా ప్రధానకార్యదర్శి దిలీప్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రధాని ప్రతిష్టతను దెబ్బతీసేలా, ప్రజలను రెచ్చగొట్టేలా కాంగ్రెస్ నాయకుల వాఖ్యలు ఉన్నాయని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల నాయకుడు దయాకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు వరుణ్, శ్రీశైలం ,సాయి,మహేందర్,అభిలాష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ యాదవనగర్ ఫీడర్ పరిధి కాలనీల్లో ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు, 11కేవీ ఆనంద్‌నగర్, హయత్‌నగర్, కల్వంచ, మదర్ డెయిరీ, సరూర్‌నగర్, అల్కాపురి, మోహన్‌నగర్, చిత్రా లేఅవుట్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. అదే విధంగా 11కేవీ వీరభద్రనగర్ ఫీడర్ పరిధి కాలనీల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, 11కేవీ వాసవికాలనీ, గ్రీన్‌హిల్స్‌కాలనీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, 11కేవీ అష్టలక్ష్మి ఫీడర్ పరిధి కాలనీల్లో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ అంతరాయానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సౌకర్యాలు లేక.. ఆటలు ఆడక

- నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు
- చెట్ల పొదలతో నిండిపోయిన వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



నిరుపయోగంగా ముర్తుజాగూడ క్రీడా ప్రాంగణం

మొయినాబాద్‌రూరల్: గ్రామీణ యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా సర్కారు లక్ష్యం నీరుగారి పోతుంది. ఉపాధి హామీ పథకం కింద రూ.లక్షలు ఖర్చు చేసి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. కానీ వాటిలో సరైన వసతులు కల్పించకపోవడంతో పిచ్చిమొక్కలు మొలిచి ఎందుకు పనికి రాకుండా పోయాయి. మరికొన్ని మైదానాలు ఊరికి దూరంగా ఏర్పాటు చేయడంతో క్రీడాకారులు అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉంది.

17 గ్రామాల్లో ఏర్పాటు

గత ప్రభుత్వ హయాంలో మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉండగా 17 గ్రామాల్లో క్రీడా మైదానాల ఏర్పాటుకు స్థలాలను గుర్తించి వాటికి కేటాయించారు. తోల్‌కట్ట, కనకమామిడి, అమ్డాపూర్, బాకారం జాగీరు, మేడిపల్లి, శ్రీరామ్‌నగర్, ఎత్‌మార్‌పల్లిలతో పాటు ప్రస్తుత మున్సిపల్‌లో గల హిమాయత్‌నగర్, ఎన్కెపల్లి, చిలుకూరు, పెద్దమంగళారం, అజీజ్‌నగర్‌లలో అధికారులు ప్రభుత్వ స్థలాలను గుర్తించి మైదానాలను ఏర్పాటు చేశారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు వృథా

క్రీడా మైదానాలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి దాదాపు రూ.4 లక్షల నిధులు ఖర్చు పెట్టడానికి అవకాశం కల్పించారు. అప్పట్లో ఈ మైదానం నిర్వహణకు ఒకరిని నియమించి క్రీడా ప్రాంగణం చుట్టూ 300 మొక్కలను నాటాలని లక్ష్యం నిర్దేశించారు. వీటిని సంరక్షించేందుకు ఓ ఉద్యోగిని ఏర్పాటు చేసి ఉపాధి పథకం ద్వారా వారికి వేతనం ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ ప్రాంగణాలకు ఉద్యోగిని నియమించకపోవడంతో పాటు అధికారుల నిర్లక్ష్యంతో ప్రజాధనం వృథా అవుతోంది. దీంతో క్రీడాకారులకు ఆట స్థలాలు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బోర్డులకే పరిమితం

గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు నిరుపయోగంగా మారాయి. చాలా చోట్ల ప్రాంగణాలను ఊరికి దూరంగా ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఏర్పాటు చేయడంతో అక్కడికి ఎవరూ వెళ్లలేక పోతున్నారు. కొన్ని చోట్ల బోర్డులు ఏర్పాటు చేసి నిర్వహణ అధికారులను నియమించలేదు. మూడేళ్లుగా ఈ క్రీడా మైదానాలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో చెట్లకు నిలయాలుగా మారాయి.

వినియోగంలోకి తేవాలి

రూ.లక్షలు వెచ్చించి గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలపై అధికారులు చొరవ తీసుకొని వినియోగంలోకి తీసుకురావాలి. వాటి నిర్వహణతో పాటు ప్రజలు, యువకులకు ఈ ప్రాంగణాలపై అవగాహన కల్పించాలి. అభివృద్ధి చేస్తే క్రీడాకారులకు ఎంతో మేలు జరుగుతుంది.

– మల్లేశ్‌యాదవ్, యువజన నేత, హిమాయత్‌నగర్

జీపీలకే అప్పగించాం

గత ప్రభుత్వం హయాంలో ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల నిర్వహణ పంచాయతీ అధికారులకే అప్పగించాం. గ్రామ పంచాయతీ వారే చూసుకోవాలి. ప్రభుత్వం ద్వారా అప్పట్లో అందజేసిన క్రీడా సామగ్రిని ఆయా గ్రామాల కార్యదర్శులకు అందజేశాం.

– సంధ్య, ఎంపీడీఓ, మొయినాబాద్

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మొయినాబాద్‌రూరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మాజీ ఎంపీపీ అనిత, హిమాయత్‌నగర్ సాయిబాబా దేవాలయ చైర్మన్ శ్రీహరియాదవ్ పేర్కొన్నారు. స్థానిక సాయిబాబా ఆలయ 6వ వార్షికోత్సవాన్ని శుక్రవారం వేదపండితులు, పూజారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ అనిత, ఆలయ చైర్మన్ శ్రీహరియాదవ్, అఖిల భారత యాదవ సంఘం కార్యవర్గ సభ్యుడు రవియాదవ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలతో సాయినాథుడికి మహామంగళ హారతి సమర్పించారు. భక్తులకు స్వామి వారి దర్శనంతో తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు స్వప్నసతీష్, స్వామి, మహేందర్‌ముదిరాజ్, కుమార్ యాదవ్, యాదయ్య, శ్రీకాంత్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మల్లేష్, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న గ్రామస్తులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో కోటమైసమ్మ దేవాలయంలో శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహ, నాభిశిల (బొడ్రాయి) ప్రతిష్ఠ జరిపి మండలం(41రోజులు) పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధానార్చకులు రావిర్యాల పరమేశ్వరశాస్త్రి ఆధ్వర్యంలో అర్చకులు భవానిప్రసాద్ అమ్మవారికి అభిషేకం, అర్చన, హోమం, వడిబియ్యం కార్యక్రమాలు చేశారు. యాదగిరి, మధులత దంపతులు క్రతువును చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్లు ముత్యాలరాజు, నారందినేష్‌రెడ్డి, డైరెక్టర్లు యాదగిరి, ఆంజనేయులుగౌడ్, మాజీ సర్పంచ్‌లు యాదయ్య, సాయిప్రసాద్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



స్లాబ్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

నందిగామ: ఎంపీడీఓ భవనం నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఎంపీడీఓ భవన నిర్మాణంలో భాగంగా శుక్రవారం స్లాబ్ నిర్మాణం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా మండలాన్ని చేసి గత ప్రభుత్వం వదిలేసిందని, ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించకపోవడంతో అద్దె భవనాలలో కొనసాగుతున్నాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మిస్తుందని చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. నందిగామ మండలంలో ఎంపీడీఓ భవన నిర్మాణానికి కేవలం శంకుస్థాపన చేసి వదిలేశారని, తాము మాటలతో కాకుండా చేతలతో భవనాన్ని నిర్మిస్తున్నామని అన్నారు. కాంట్రాక్టరు భవన నిర్మాణంలో నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహాయాదవ్, మాజీ ఎంపీటీసీలు కృష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, శంకరయ్య, సీహెచ్.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందిస్తున్న చెన్నయ్య తదితరులు

షాబాద్: విద్యార్థులకు కరాటే పోటీలు అవసరమని రాష్ట్ర స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆస్పల్లిగూడ సమీపంలో ఉన్న కైట్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న మొగిలిగిద్ద ఎంజేపీ గురుకుల పాఠశాలలో 36 మంది విద్యార్థినులకు వివిధ కరాటే పోటీలో పాల్గొని ప్రతిభ కనబర్చారు. శ్రుతి, కీర్తన, శ్రీవైష్ణవి, వర్ష, సిరిలతో పాటు తదితరులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శివరంజని, ఉపాధ్యాయురాలు నాగజ్యోతి, అర్చన, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు



ఆస్పత్రిలో అగ్నిప్రమాదం గురించి అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మహేశ్వరం: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక సిబ్బంది సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అక్కడి సిబ్బందికి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు వెంటనే అగ్నిమాపక అధికారులు, సిబ్బంది, టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఫైర్‌మెన్ పి.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

దాడులను ఉపేక్షించం



యాదయ్యను పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ గొర్రెంకల యాదయ్యపై బీఆర్‌ఎస్ నాయకులు దౌర్జన్యం చేయడాన్ని ఖండిస్తున్నామని, దాడులను ఉపేంక్షిలేదని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు సయ్యద్ అజీజ్ స్పష్టంచేశారు. శుక్రవారం మండల పరిధిలోని అన్నోజిగూడలో యాదయ్యను పరామర్శించిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే సబితారెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని తట్టుకోలేక, కాంగ్రెస్ నాయకుడు యాదయ్య తదితరులు అడ్డుకోబోయారని పేర్కొన్నారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు యాదయ్యను బలవంతంగా బయటకునెట్టి, దాడికి యత్నించడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదన్నారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణరెడ్డి, మహేందర్, జగదీష్ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎంకన్నగూడ తండాలో నూతనంగా నిర్మిస్తున్న సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య రూ.25వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల సంక్షేమం, ఆధ్యాత్మిక అభివృద్ధికి బీజేపీ ఎప్పుడూ సహకరిస్తుందని చెప్పారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ఆదర్శనీయమని అన్నారు. ప్రతిఒక్కరు సేవాభావాన్ని అలవర్చుకొని ఆలయాల అభివృద్ధి కృషి చేయాలని సూచించారు. అనంతరం తండావాసులు బాబయ్యను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వంశీకృష్ణ, ప్రశాంత్, గిరిజనతండా పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తదితరులు

కందుకూరు: మండల పరిధిలోని కొత్తూర్‌లో శ్రీ భక్త హనుమాన్ రామలింగేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. వేద పండితుడు రేవెళ్ల రాజుశర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం, మంత్రోచ్చారణల మధ్య క్రతువు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ జంగారెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అంజయ్యగౌడ్, ఆర్‌ఆర్ పౌల్ట్రీ యజమాని రవీందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అతిథులను నిర్వాహకులు సన్మానించారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. డీసీసీ డైరెక్టర్ పి.ఆనంద్, డాక్టర్ శంకర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ సాధ మల్లారెడ్డి, నాయకులు భూమిరెడ్డి, చెన్నారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్న బీజేపీ



మహేశ్వరం: నాగుల్‌దోని తండాలో కరపత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం: కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని కాంగ్రెస్ ఎస్టీసెల్ మండల మాజీ అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్ ఆరోపించారు. శుక్రవారం మండల పరిధిలోని నాగుల్‌దోనితండా, దయ్యాలగుండు తండాల్లో పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేసి, వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం.. రాజ్యాంగ విలువలను కాలరాస్తుందని విమర్శించారు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని. ప్రజలందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, ఆవుల యాదయ్య, నడికూడ శివ, మంత్రి బాల్‌రాజ్, లాజర్, సేవ్యా నాయక్, పాండు నాయక్, అంజయ్య, ఇర్షాద్, రవి నాయక్, కొమురయ్య, రాజు, దస్రు నాయక్, పాండు పలువురు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అందరికీ మేలు



పహాడీషరీఫ్: ప్రచారం చేస్తున్న మాజీ మేయర్ పారిజాత తదితరులు

పహాడీషరీఫ్: కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు సమన్యాయం దక్కుతుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మాజీ మేయర్ పారిజాత నర్సింహా రెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధి మామిడిపల్లి రంగనాయకుల కాలనీలో పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం జైబాపూ జైభీమ్ జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగం పట్ల కొనసాగుతున్న వివక్ష, మహాత్మా గాంధీ చేసిన సేవలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, నాయకులు లాల్ సతీష్ గౌడ్, ఆదిల్ల జంగయ్య, బొల్లపల్లి కుమార్, విజయ్, తిరుమలేష్, భాస్కర్, నరేష్ గౌడ్ పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

కందుకూరు: భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం కందుకూరు చౌరస్తాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రాజు మాట్లాడుతూ.. దేశంలో నిర్మాణ రంగం చాలా కీలకమైందని, దేశవ్యాప్తంగా పది కోట్లకు పైగా కార్మికులు పని చేస్తున్నారని పేర్కొన్నారు. 1996లో కార్మికులు పోరాడి తెచ్చుకున్న చట్టాన్ని, 2014లో మోదీ ప్రభుత్వం కాలరాసేలా కార్పొరేట్లకు అనుకూలంగా మార్చిందని ఆరోపించారు. వివిధ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన బోర్డులను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని కోరారు. దీంతో నిర్మాణ కార్మికుల కోసం దేశంలో ఉన్న రూ.36 వేల కోట్ల నిధులను ఇతర కార్మికుల సంక్షేమానికి మళ్లించేందుకు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగిస్తూ, స్వతంత్రంగా పని చేసే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 21, 22 తేదీల్లో శంషాబాద్‌లో నిర్వహించనున్న మహాసభలకు కార్మికులు భారీగా హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శివ, నరసింహ, యాదయ్య, మనోహర్, రంజిత్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా 'అక్షిత'



బడిబాట కార్యక్రమంలో సన్నీకుమార్ (ఫైల్)

- దశాబ్దకాలంగా సొంత డబ్బుతో ప్రజాసేవా
- పేద విద్యార్థులకు చేయూత

మీర్‌పేట: సహాయం చేయటానికి ధనవంతులే కానక్కర్లేదు. సమాజానికి తన వంతుగా ఏదైనా చేయాలన్న ఆలోచన, తపన ఉంటే చాలని అనుకున్నాడు. అనుకున్నదే తడవుగా తాను సంపాదించిన దాంట్లో కొంతైనా సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయాలని 'అక్షిత ఫౌండేషన్'ను స్థాపించడమే కాకుండా.. నిత్యం సేవా కార్యక్రమాలతో అందరికీ ఆదర్శంగా నిలిచాడు మీర్‌పేట జనప్రియ మహానగర్‌కు చెందిన రాపాక సన్నీకుమార్.

బడి బాట పట్టని వారిని గుర్తించి..

ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు తన వంతు సహకారం అందిస్తున్నాడు సన్నీకుమార్. స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు, షూస్ అవసరమైన స్టేషనరీ పంపిణీ చేస్తున్నాడు. బడి బాట పట్టని పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులను ఒప్పించి పాఠశాలకు పంపిస్తున్నాడు.

ఆర్థికసాయం..

రోడ్లపై భిక్షాటన చేస్తున్న వారికి భోజనం అందించడంతో పాటు.. అవసరమైన దుప్పట్లు, దుస్తులు తదితర సామగ్రిని అందజేస్తూ.. అభాగ్యులకు అండగా నిలుస్తున్నాడు. నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, అత్యవసరమైతే ఆర్థిక సహాయం అందజేయడం, వైద్యం చేయించుకోలేని వారిని, ఆసుపత్రిలో చేర్పించి వైద్యం చేయిస్తూ.. పెద్దన్నగా ఆదరిస్తున్నాడు.



వృద్ధురాలికి గ్యాస్ స్టవ్, నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధి (ఫైల్)

ఆడపిల్ల పుట్టిందని..

మా కుటుంబంలో ఆడపిల్ల పుట్టిందని చిన్నచూపు చూడటం నన్ను కలచివేసింది. దీంతో మా పాప అక్షిత పేరుతో ఫౌండేషన్‌ను స్థాపించాను. అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నాను. ఎవరి వద్ద ఏమీ ఆశించకుండా సొంత డబ్బుతో సేవ చేస్తున్నాను.

– రాపాక సన్నీకుమార్, అక్షిత ఫౌండేషన్ అధ్యక్షుడు